క్లుప్తంగా

ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు శివారులోని కూడలి పక్కన ఆంజనేయ స్వామి విగ్రహం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఉప్పల పాడు నారాయణ రెడ్డి దాత సహకారంతో రూ.25 లక్షల ఖర్చుతో ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, శరణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కార్తీక వన భోజనాలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం కార్తీక వనభోజనం నిర్వహించారు. శివాలయంలో శివుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో వనభోజనం చేశారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని ఉటుకూర్‌లోని ఓమేష్ స్వామి ఇంట్లో చేసిన అయ్యప్ప పూజలో స్వాములు చేసిన శరణగోషలు మార్మోగింది. శుక్రవారం ఓమేష్ స్వామి అయ్యప్ప స్వామి పూజ చేపట్టారు. గణేష్, కుమార స్వామి, అయ్యప్ప స్వాముల చిత్రపటాలకు అష్టోత్తరణ అర్చనలు చేశారు. లక్ష్మీ నారాయణ, ఎల్లయ్య, రఘు, శ్యాం, రాము, శశిధర్, శ్రీహరి, కృష్ణ,, శ్రీనివాసులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో గురువారం తెల్లవారుజామున గొల్ల నరసింహులు ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోవడంతో శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు రాముడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని అన్నారు.

ఆందోళనలో మిర్చి రైతులు



మానవపాడు: మిర్చి రైతు కష్టాలు వర్ణణీతం. మిరప రైతులకు సకాలంలో వర్షాలు లేక ఏడాది ప్రారంభం నుంచి కష్టాలు ఎదురవుతున్నాయి. పంట పొలాల్లో తెగుళ్ల సోకి మిర్చి పంటను తొలగించారు. కష్టానష్టాలతో పండించిన మిర్చి పంటల్లో తెగుళ్ల బెడద వెంటాడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.45 వేల దాకా కౌలుకు తీసుకొని పంటకు ఎకరాకు దాదాపు రూ.1.80లక్షల నుంచి రూ.2.20 లక్షలు పెట్టుబడులు పెడుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడులు వస్తాయో.. రావోని రైతులు దిగాలు చెందుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి డాక్టరేట్


భానుప్రకాష్

గద్వాల అర్బన్: అలంపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అంబటి భాను ప్రకాష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. వనపర్తి జిల్లా సాహిత్యం ఒక పరిశీలన అంశంపై డా.చవ్వా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి, డాక్టరేట్ ఎంపికకు ప్రకటించించారు. దీంతో గద్వాల సాహితి మంగళగిరి శ్రీనివాసులు, నాయుడు, జయన్న మహేందర్, భాస్కర్, హరినాగభూషణం అంబటి భానుప్రకాష్‌ను అభినందించారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: యువకుడు అదృశ్యమైన సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఐడీఎస్ ఎంటీ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారితో వాకబు చేయగా.. ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో తండ్రి రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని తెలియజేశారు.

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో?

- వరి కోతలు ప్రారంభమై వారం రోజులు గడిచినా ప్రారంభం కాని వైనం
- రాయచూర్‌కు తరలిపోతున్న ధాన్యం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు


ధరూరు శివారులో యంత్రాలతో కోతలు కోస్తున్న రైతులు

ధరూరు: యాసంగిలో సాగుచేసిన వరి పంట చేతికి వచ్చింది. పంటలు సాగు చేసుకున్న రైతుల పొలాలు కోతకు సిద్ధమయ్యాయి. నెల రోజులుగా కోతలు ప్రారంభించినా.. నేటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దీంతో వడ్ల కొనుగోలు ప్రారంభం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాలపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై రైతులు అధికారుల తీరుపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కోతలు కోసిన రైతులు అటు పక్క రాష్ట్రమైన కర్ణాటకలోని రాయచూరులో అమ్ముకునే పరిస్థితి నెలకొంది. కోత కోసిన రైతులు నిల్వ ఉంచుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. కొనుగోళ్లు ప్రారంభించకపోతారా అని రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని పొలాల వద్దే ఉంచి ఎదురు చూపులు చూస్తున్నారు.

ప్రారంభంపై లేని క్లారిటీ...

కేంద్రాల్లో అటుపోయిన ఏడాది ఈ పాటికే వరి కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. చాలా మంది రైతులు పంట కోతకు వచ్చినా.. కోసిన ఉత్పత్తిని నిల్వ ఉంచాలని భావించి కోతలు చేయడం లేదు. ఇంతవరకు కొనుగోళ్లపై క్లారిటీ రాలేదు. వ్యవసాయ శాఖ అధికారులను ఎన్నికల విధులకు తీసుకోవడం... మరో రెండు రోజులు గడిచాక కౌంటింగ్ పూర్తయ్యాకే గాని కొనుగోలుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


పొలాల వద్ద కోత కోసిన వరి ధాన్యాన్ని తరలించేందుకు సిద్ధం చేసుకున్న ట్రాక్టర్

పెరిగిన సాగు...

గద్వాల నియోజకవర్గంలో ఏటా వరి సాగు పెరుగుతూ వస్తుండగా.. ఈ సారి సాగు కాస్త తగ్గింది. ప్రభుత్వం యాసంగిలో వరిని సాగు చేయవద్దని ప్రకటన చేయడంతో పాటు ధరూరు మండలంలో ఉన్న నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు రిజర్వాయర్‌కు పడిన లీకేజీలను సరి చేస్తామని చెప్పడంతో సాగునీరు అందదని భావించిన కొందరు రైతులు సాగుకు ముందుకు రాలేదు. గట్టు, మల్దకల్, కేటీదొడ్డి, గద్వాల మండలాల్లో ప్రతి ఏటా 4 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. బీడు భూములను సాగులోకి తీసుకొచ్చి పంటలు పండించుకుంటున్న రైతులకు ప్రతిసారి ఇబ్బందులు తప్పడం లేదు.

కర్ణాటకలో రేటు ఎక్కువ...

గద్వాల నియోజకవర్గ రైతులకు కర్ణాటక రాయచూర్ మార్కెట్ దగ్గరలో ఉండటం.. ఇక్కడికంటే అక్కడ కాస్త రేటు ఎక్కువగా ఉండటంతో రైతులు రాయచూర్‌కు తరలించేందుకు మొగ్గు చూపుతున్నారు. రాయచూరులో క్వింటాల్‌కు రూ.2,800 నుంచి రూ.3,000 వరకు గిట్టుబాటు ధర పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పంట సాగు తక్కువగా సాగు చేసుకున్న రైతులు రాయిచూరుకు తరలించుకోలేక.. ఇటు కేంద్రాలు తెరుచుకోక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గాలులు, వానలు కురియడంతో కోత దశలో ఉన్న పంటల రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాయచూర్‌కు తీసుకెళ్తా..



మాకున్న కొద్ది పొలంలో 2 ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. పంట కోత కోశాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితిలో సెంటర్ వద్ద పడిగాపులు కాసే బదులు రాయచూర్‌లో విక్రయించాలని భావిస్తున్నాం. ఇక్కడి కంటే అక్కడ ధర కూడా ఎక్కువగానే ఉందని తోటి రైతులు చెప్పారు.

– దేవరాజ్, రైతు, ధరూరు

ఆదేశాలు రాలేదు..



వరి ధాన్యం కొనుగోలుపై ఇంకా పైనుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. త్వరలో వచ్చే అవకాశం ఉంది. రాగానే రైతులు పండించిన ధాన్యాన్ని ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు కొనుగోలు చేస్తాం.

– శ్రీలత, ఏఓ, ధరూరు

భవానీ మాత ఉత్సవాలు ప్రారంభం

గట్టు: అంబాభవానీ మాత ఉత్సవాలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రతియేటా కార్తీక మాసంలో అంబాభవాని మాత ఉత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే కార్తీక బహుళ పంచమి శుక్రవారం పందిరి పూజతో భవాని మాత ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఎస్ఎస్‌కే (క్షత్రియ సంఘం) సమాజ్ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. పందిరి పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఆకు పూజ నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట మామిడి తోరణాలతో ప్రత్యేకంగా పందిరి వేశారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయం ఎదుట మామిడి ఆకులు, తోరణాలతో పందిరి వేసి పూజలు చేశారు. జాతర సందర్భంగా ఇప్పటికే సంత బజారులో మిఠాయి దుకాణాలు, చిన్న పిల్లల ఆట వస్తువుల విక్రయ దుకాణాలు వెలిశాయి. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం సభ్యులు పాపురం వెంకటేష్, సూపర్ పటేల్ వీరన్న, వినోద్, చంద్రమోహన్, లక్ష్మణ్, సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పందిరి పూజ చేస్తున్న భక్తులు

ఆదమరిస్తే.. అంతే సంగతి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో డ్రెయినేజీ నోరుతెరిచింది. ఆ డ్రెయినేజీలో ట్రాఫిక్ కోన్స్‌ను అడ్డంగా ఉంచారు. ఆదమరిచి వాహనదారులు గమనించక కాల్వలో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రయాణం.. నరకప్రాయం


చెన్నిపాడు నుంచి మానవపాడు వెళ్లే రోడ్డు ఇలా..

- గుంతలమయంగా రోడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

మానవపాడు: మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు, మండలాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు మధ్య రోడ్లు గుంతలమయంగా మారాయి. బీటీ రోడ్లు ధ్వంసమై పెద్ద గుంతలుగా ఏర్పడి వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు వెంట ప్రయాణించాలంటే ప్రయాణం నరకప్రాయంగా మారిందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళలో గుంతలు కనిపించక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు



కలుకుంట్ల నుంచి మద్దూరుకు వెళ్లే రోడ్డు మార్గం కలుకుంట్ల బ్రిడ్జి వద్ద వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ప్రయాణించాలంటే దుమ్ముతో కార్యాలయాలకు ఉద్యోగస్తులు సమయానికి వెళ్లలేకపోతున్నారు. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు బాగుచేయించాలి.

– ఆత్మలింగారెడ్డి, కలుకుంట్ల సర్పంచ్

వర్షం పడితే అవస్థలు...

మానవపాడు మండల కేంద్రానికి ప్రధాన రహదారి వెంట ప్రయాణించాలంటే గుంతలమయంగా రోడ్లు ఉన్నాయి. వర్షాలు పడితే నీటి కుంటలను తలపిస్తున్నాయి. రవాణా సౌకార్యార్థం, ఆరోగ్యం కోసం, పాఠశాలలకు బస్సు సౌకార్యం కోసం, ఆటోలు, వాహనాలు ఈ రోడ్డు వెంటనే కర్నూల్, అలంపూర్ చౌరస్తాకు ప్రయాణాలు సాగిస్తుంటారు. 10 సంవత్సరాలుగా మానవపాడు, చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు వెంట ప్రయాణాలు సాగిస్తున్నారు. గుంతల రోడ్లపై ప్రమాదాలు జరగకముందే రోడ్డు నిర్మాణాలు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టెండర్ ప్రక్రియ పూర్తికావాలి

రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. నిధులు విడుదల అవగానే పనులు ప్రారంభిస్తాం. మానవపాడు రోడ్డుకు రూ.4 కోట్లు, కలుకుంట్ల రోడ్డుకు రూ.3.40 లక్షల టెండర్ వేశారు. కానీ ఎవ్వరూ రాలేదు. ఎక్కడైతే గుంతలు ఉన్నాయో అక్కడ, నిధులు మంజూరైన వెంటనే గుంతలు మూసి వేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

– మహేష్, ఆర్అండ్‌బీ ఏఈ, మానవపాడు

మరమ్మతులు చేపట్టాలి..



రోడ్లపై గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చెన్నిపాడు–మానవపాడు రోడ్డు మార్గం ప్రమాదకరంగా మారిది. ఈ ప్రయాణంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తుంది. రాత్రి సమయాల్లో, గుంతల రోడ్లల్లో ప్రయాణించాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చిన్న వెంకట్రాములు, మానవపాడు

గెలుపు కోసం నాయకుల ప్రార్థనలు

అమరచింత: మక్తల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవాలంటూ శుక్రవారం పట్టణంలోని రాజావలీ, మహబూబ్ ఉస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈమేరకు జామీయ మసీద్ కమిటీ అధ్యక్షుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం బీఆర్ఎస్ పార్టీ కబంధ హస్తాల మధ్య అప్పుల తెలంగాణగా మారిందన్నారు. ప్రజలు కోరుకున్న తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. మసీదులో ప్రత్యేక నమాజు అనంతరం ముస్లిం మైనార్టీలతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కొబ్బరికాయలను కొట్టి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో తౌఫిక్, అను, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


మసీదులో నమాజ్ చేస్తున్న నాయకులు

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

ధరూరు: క్రైస్తవుల పవిత్ర పండుగ క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని చర్చిలకు రంగులు, విద్యుత్ దీపాల అలంకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 25న నిర్వహించుకునే క్రిస్మస్ పండుగకు మండల పరిధిలోని మార్లబీడు, ర్యాలంపాడు, సోంపురం, మన్నాపురం, రేవులపల్లి, చింతరేవుల, అల్వాలపాడు, గార్లపాడు, ఉప్పేరు తదితర గ్రామాల్లోని చర్చిలు ముస్తాబవుతున్నాయి. మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి ప్రాంగణంలో గత నెల 25న సెమీ క్రిస్మస్ వేడుకలతో సంబరాలు ప్రారంభించారు. చర్చిని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా.. నక్షత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు చర్చీల్లో చిన్నారులు క్రీస్తు జననం నాటక ప్రదర్శనల శిక్షణ ఇస్తున్నట్లు పాస్టర్ రెవ సీపీ ప్రసాద్ తెలియజేశారు.


విద్యుత్ దీపాలతో ధరూరు ఎంబీ షాలేం చర్చి

శ్రీశైల క్షేత్రానికి పాదయాత్ర


పాదయాత్ర చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని లింగన్‌వాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు అలంపూర్ జోగుళాంబ నుంచి శ్రీశైలం మల్లన్న క్షేత్రం వరకు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస పార్టీ నాయకులు బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సగినాల రాజు మాట్లాడారు. కాంగ్రెస పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ ఎన్నికల్లో గెలవాలని మూడో తేదీ వరకు పాదయాత్రను శ్రీశైలం వరకు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భర్త కాంగ్రెస్ నాయకులు గోకారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు డాక్టర్ల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యసిబ్బంది ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


మల్దకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

మల్దకల్: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మల్దకల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రామాంజనేయులు గౌడ్ సూచించారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్దకల్ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, ఈ వ్యాధిని నిర్మూలించడమే మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎయిడ్స్ నివారణకు మార్గం ఒక్కటేనని, రోగనిరోధక శక్తిని పెంచే మందులు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు వాడాలని సూచించారు. అధ్యాపకులు నర్సింహులు, దేవసేనారెడ్డి, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మి, శ్రీనాథ్, తిమోతి, ఆంజనేయులు, రవిప్రకాష్ పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం

ధరూరు: ఓ రైతు తన పొలం వద్ద నుంచి పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో వరి గడ్డి తరలిస్తుండగా.. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ అయి గడ్డి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కోతులగిద్దకి చెందిన తెలుగు శ్రీను తన పొలం నుంచి పాడి పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో గడ్డి తరలిస్తుండగా... మార్గమధ్యంలో విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు వ్యాపించాయి. గడ్డి పూర్తిగా కాలిపోయింది. మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల రైతులు మంటలు ఆర్పారు.

గట్టులో 84.50 శాతం పోలింగ్

- పురుషులు 86.25 శాతం, స్త్రీలు 62.81 శాతం నమోదు
- అత్యధికం యల్లందొడ్డి, అత్యల్పం మల్లంపల్లి
- మెజార్టీ అంచనాల్లో ఇరు పార్టీల నేతలు


మాచర్లలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

గట్టు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఎలాంటి గొడవలు, వివాదాలు లేకుండా ముగియడంతో అటు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గట్టు మండలంలో గురువారం జరిగిన పోలింగ్‌లో 55 బూతుల్లో మొత్తం 46,773 మంది ఓటర్లకు, పురుషులు 19,833 మంది, స్త్రీలు 19,689 మంది మొత్తం 39,523 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల పోలింగ్ శాతం 86.25 శాతం కాగా.. స్త్రీలు 82.81 శాతం మాత్రమే నమోదైంది. స్త్రీల కంటే పురుషులే ఓటింగ్‌లో అత్యధికంగా పాల్గొన్నారు. దీంతో పోలింగ్ శాతం 84.50గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇందులో అత్యధికంగా తారాపురంలో 95 బూత్‌లో 448 మందిగాను 419 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 93.53 శాతం పోలింగ్ నమోదైంది. రాయాపురం 93 బూత్‌లో 797కు గాను 745 పోల్ కాగా.. 93.48 శాతం నమోదు కాగా.. ఇదే గ్రామంలోని 94 బూత్‌లో 668 మంది ఓటర్లకు గాను 618 ఓట్లు పోల్‌కాగా.. 92.51 శాతం నమోదైంది. చమన్‌ఖాన్‌దొడ్డి పోలింగ్ బూత్ 130లో 530కు గాను 485 పోల్ కాగా.. 91.51 శాతం నమోదైంది. తప్పెట్లమొర్సు 139 బూత్‌లో 935కు గాను 848 పోల్ కాగా.. 90.70 శాతం నమోదైంది. ఇదే గ్రామంలోని 140 బూత్‌లో 906కు గాను 816 పోల్ కాగా.. 90.07 శాతం నమోదైంది. ఇక అత్యల్పంగా మల్లంపల్లిలోని 109లో 307కు గాను 214 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. 69.71 శాతం నమోదైంది. ఆరగిద్దలో 136 బూత్‌లో 1291కు గాను 901 పోల్ కాగా.. 69.79 శాతం నమోదైంది.

మెజార్టీ అంచనాల్లో నేతలు..

గ్రామాల వారీగా రెండు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు మెజార్టీ అంచనాల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పోలింగ్ బూత్‌ల వారీగా నమోదైన ఓటింగ్ శాతం వివరాలతో లెక్కలు కడుతూ, ఫలానా గ్రామంలో మాకే ఎక్కువ మెజార్టీ వస్తుందనే నమ్మకాన్ని ఆయా పార్టీలకు చెందిన నేత ధీమా వ్యక్తం చేశారు. కొందరైతే ఏకంగా మా పార్టీకి చెందిన నేతలు గెలుస్తాడంటే.. మా పార్టీకి చెందిన నేత గెలుస్తాడని వేలకు వేలు పందెం కాస్తున్నారు. మరో 24 గంటలు(ఆదివారం మధ్యాహ్నం) వరకు స్పష్టమైన ఫలితాలు వెలువడనున్నాయి. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సంగనమోని శ్రీనివాసులు కుటుంబానికి 1993–94 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల మిత్ర బృందం శుక్రవారం రూ.36 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని వేళల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

